ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
ఆదివారం 24 నవంబరు 2024



ఎస్. కొండాపురం కొండల్లో టీడీపీ కూటమి నాయకులు తరలిస్తున్న ఎర్రగరుసు

కొల్లగొడుతున్నారు..!

ఆదోనిలో ఎర్రమట్టి మాఫియా

- కొండాపురంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- అనుమతులు ముగిసినా తవ్వకాలు
- పర్యావరణ అనుమతి లేకుండానే గరుసు తరలింపు
- మరో 'కేజీఎఫ్'గా మార్చేసిన వైనం

ఆదోని రూరల్/కర్నూలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలో ఎర్రమట్టి మాఫియా రెచ్చిపోతోంది. నాడు వైసీపీ నాయకులు.. నేడు కూటమి నాయకులు అధికారం మాటున కొండాపురం కొండలను కొల్లగొడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇచ్చారు.. మైనింగ్ అనుతులు ఇచ్చారనే సాకుతో ఇష్టారాజ్యంగా కొండల్ని పిండి చేస్తున్నారు. రోజూ వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లు ఎర్రమట్టి రవాణా చేస్తూ రూ.కోట్లలో సంపాదిస్తున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాదొరెడ్డి అండతో ఆ పార్టీ నాయకులు ఆదోని బైపాస్ రోడ్డు పక్కనే కొండల్ని హరించేశారు. అక్కడి నుంచి కొండాపురం కొండల్లో వాలిపోయారు. ప్రస్తుతం టీడీపీ కూటమి నాయకులు మేము సైతం అంటూ ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తున్నారు. తమ పంటపొలాలు నాశనం అవుతున్నాయని రైతు శ్రీనివాసులు కన్నీటి వేదనను రైతులకు గరుసు దొంగల బెడద శీర్షికన ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. గరుసు తవ్వకాలకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయితే అలాంటి అనుమతులు లేవు.. తాత్కాలికంగా ఇచ్చిన అనుమతులు కూడా నవంబరు 3వ తేదీకే ముగిశాయి అంటూ మైనింగ్ అధికారులు తేల్చిచెప్పారు. కొండపురం కొండల్లో గరుసు తవ్వకాలకు ప్రస్తుతం పర్యావరణ అనుమతులు (ఈసీ) లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేయడంపై చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. మొత్తం మీద ఆదోనిలో మాత్రం కూటమి నేతలు మరో కేజీఎఫ్ (కొండాపురం గ్రావెల్ ఫీల్డ్)కు తెరతీసి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు.



ఫిర్యాదు చేయడానికి వచ్చిన తల్లీకొడుకులు బోయ సరోజమ్మ, శ్రీనివాసులు

ఆదోని-ఎమ్మిగనూరు జాతీయ రహదారి-167 పక్కనే బైచిగేరి క్రాస్ రోడ్డు సమీపంలో రెవెన్యూ రికార్డుల్లో ఎస్.కొండాపురం గ్రామం ఉంది. 'ఎస్.కొండాపురం కొండలు' ఆదోని, బైచిగేరి, కపటి గ్రామాల మధ్య సర్వే నంబరు.1 పరిధిలో 768 ఎకరాల విస్తీర్ణంలో గరుసు నిల్వలు ఉన్నాయి. ఇక్కడి ఎర్రమట్టి, క్వారీ అక్రమార్కులకు అడ్డాగా మారింది. అధికారంలో ఎవరు ఉన్నా.. కొండాపురం కొండల్లో ఎర్రమట్టి కాసులు కురిపిస్తోంది. ప్రస్తుతం టీడీపీ నాయకులు అధికారం మాటున అనుమతులు ఉన్నాయంటూ ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తూ రవాణా చేస్తున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు ఎర్ర మట్టికి డిమాండ్ ఉంది. రోజుకు వందలాది టిప్పర్లు రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పరు దూరాన్నిబట్టి రూ.5 వేలు నుంచి రూ.6 వేలకు పైగా విక్రయిస్తున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకుని ప్రభుత్వ భూములు సంరక్షించాల్సిన రెవన్యూ, గనులు భూగర్భ వనరుల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండతో ఆనాడు ఎర్రమట్టి మాఫియా పెట్రేగిపోతే.. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ సహకారంతో ఎర్రగరుసు తవ్వకాలు చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మిగతా 6లో...

మెగా సమావేశానికి సిద్ధం కండి

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మీటింగ్‌పై కలెక్టర్ రాజకుమారి



సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించేందుకు చక్కటి ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ రాజకుమారి ఎంఈఓలు, పాఠశాల హెచ్‌ఎంలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెగా పేరెంట్ టీచర్స్ యాక్షన్ ప్లాన్‌పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. సమావేశాలకు హాజరైన తల్లితండ్రులకు, ఆహ్వానితులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనంతో పాటు అదనపు ఆహార పదార్థాలను జోడించి శుభదిన్ భోజనం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రేపు పీజీఆర్ఎస్ ద్వారా ప్రజా వినతులు

నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ఈనెల 25 వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు.

143 మంది పోలీసుల బదిలీ



నంద్యాల క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 143 మంది పోలీసులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో బదిలీల ప్రక్రియను ముగించారు. ఒకే పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాలకు మించి విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ఈ బదిలీల్లో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఎంతమంది వచ్చారు, ఎన్ని ఖాళీలు ఉన్నాయన్నది తెలుసుకుని వాటి ఆధారంగా బదిలీలు చేశారు. బదిలీల్లో ఏఎస్ఐలు 28 మంది, హెడ్ కానిస్టేబుళ్లు 60 మంది, పోలీస్ కానిస్టేబుళ్లు 55 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగి జీవితంలో బదిలీలు అనేవి సాధారణమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికి బదిలీ చేసినా పనిచేసేందుకు పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, డీఎస్పీలు రామాంజినాయక్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ రమణ చాకచక్యం

- గేర్ రాడ్ ఊడిపోయినా ప్రమాదం తప్పించిన వైనం
- బస్సులో 80 మంది విద్యార్థులు



గేర్ రాడ్ ఊడిపోయిన బస్సు ఇదే

కొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యార్థులు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదం నుంచి బయట పడింది. శనివారం సాయంత్రం మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఆత్మకూరు డిపో నుంచి ఏపీ21జడ్0734 అనే ఆర్టీసీ విద్యార్థుల బస్సు కొత్తపల్లి మీదుగా జడ్డువారిపల్లెకు వెళుతోంది. కొత్తపల్లి నుంచి సుమారు 80 మంది విద్యార్థులు బస్సు ఎక్కారు. ఎదురుపాడు గ్రామ సమీపంలో వచ్చేసరికి బస్సు గేర్ రాడ్డు వెల్డింగ్ ఊడిపోయి డ్రైవర్ చేతిలోకి వచ్చేసింది. ఊహించని పరిణామానికి బస్సులోని విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. బస్సు డ్రైవర్ రమణ చాకచక్యంతో బస్సును కిలోమీటరు మేర తీసుకువచ్చి ఓ హోటల్ ముందు నిలిపేశారు. బస్సులోని విద్యార్థులు ఊపిరి తీసుకున్నారు. బస్సు డ్రైవర్ రమణను తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అభినందించారు.

శ్రీశైలంలో భక్తుల సందడి





గంగాధరమండపం ఎదురుగా కార్తీక పూజలు చేస్తున్న భక్తులు, నిత్యకళారాధనలో కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజోతి): శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసంతో పాటు శని,ఆది సెలవు రోజులు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద దీపారాధనలను చేశారు. ఈ సందర్భంగా దర్మపథంలో నిత్యకళారాధన ఆకట్టుకుంది. సాయంత్రం తిరుపతికి చెందిన సహస్ర అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. వినాయక కౌత్వం, శివస్తుతి, శివకైవారం, ఓం నమఃశివాయ శివాయ నమ తదితర శైవగీతాలకు కళాకారులు నృత్యప్రదర్శన నిర్వహించారు.

బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు

బలహీన వర్గాల పురోభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత

6

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు : జిల్లా న్యాయాధికారి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.కబర్ధి

ఓర్వకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. కబర్ది అన్నారు. శనివారం ఓర్వకల్లు పొదుపు సంఘం కార్యాలయంతో పాటు, గుడుంబాయి తండా గ్రామంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలకు ఏవైనా సమస్యలు ఉంటే న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే న్యాయ సలహాలు, సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, ఏపీ జాతీయ మహిళా కమిషన్ సభ్యులు షేక్ రోఖియ బేగం, డీఎల్ఎస్ఏ రిసోర్స్‌పర్సన్లు మనోహర్, హేమలత, ఓంప్లిస్ గౌరవ సలహాదారులు విజయ భారతి, ఎంపీడీవో శ్రీనివాసులు, సీడీపీవో అనురాధ, రూరల్ సీఐ చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

ఆ ఒప్పందాలను బహిర్గతం చేయాలి




మాట్లాడుతున్న రంగ నాయుడు

ఆత్మకూరురూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అదానితో ఆనాటి సీఎం వైఎస్ జగన్ చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను బహిర్గతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు కోరారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి ప్రతాప్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో అదాని కంపెనీలతో జరిగిన ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, అవినీతి అదాని వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి వైఎస్ జగన్, అదానిలను శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్ ఒప్పందాలలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ముందు నుంచి సీపీఐ ఆరోపిస్తోందని అన్నారు. ఏపీలో అదాని గ్రూప్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు రమేష్ బాబు, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల కార్యదర్శులు వెంకటశివుడు, ఏసేపు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో దళారులు

- పాణ్యంలోని ఇంటి స్థలానికి ఆళ్లగడ్డలో రిజిస్ట్రేషన్
- సర్వే నెంబర్లు మార్చి ఇంటి పన్ను రసీదుతో..
- అక్రమ రిజిస్ట్రేషన్‌లతో బ్యాంకు రుణాలు ?



పాణ్యం, నవంబరు23(ఆంధ్రజ్యోతి) : దళారుల అక్రమాలకు హద్దే లేకుండాపోయింది. బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని దూరప్రాంతాలలోని నిషేధిత స్థలాల్లో తప్పుడు సర్వే నెంబర్లు వేసి మరీ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ నిబంధనలు తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇంటి పన్ను రశీదుతో రిజిస్ట్రేషన్ చేయవచ్చన్న ఒకే ఒక్క కారణంతో దళారులు రిజిస్ట్రేషన్ చేయించి మరీ బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటి స్థలాన్ని ఆళ్లగడ్డలో రిజిస్ట్రేషన్ చేయడమే ఇందుకు ఉదాహరణ. సుగాలిమెట్టకు చెందిన 13-237/2, 13-490/1 నెంబరు ఇళ్లు 1806 సర్వే నెంబరులో ఉన్నాయి. ఈ సర్వే నెంబరు ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉండడంతో రిజిస్ట్రేషన్ చే యడానికి అవకాశం లేకపోవడంతో 2024 జూలై 9న ఆళ్లగడ్డ రిజిస్టార్ కార్యాలయంలో 934 సర్వేనెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ రిజిస్ట్రేషన్‌కు ఆధారంగా ఇంటి పన్ను జత చేసి పని ముగించుకున్నారు. కాగా రిజిస్ట్రేషన్‌కు వేసిన 934 సర్వే నెంబరు పాణ్యం ఎస్సీ కాలనీకి చెందిన గ్రామ కంఠంగా అధికారులు పేర్కొంటున్నారు. పాణ్యం మజరా గ్రామంగా ఉంటున్న సుగాలిమెట్ట గ్రామాన్ని 2020లో పంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఈ గ్రామం 1806 సర్వే నెంబరులో కొనసాగుతుంది. రిజిస్ట్రేషన్‌లకు ఆస్కారం లేకపోవడంతో అక్రమార్కులు దూరప్రాంతాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఎక్కువ మొత్తంలో బ్యాంకు రుణాలు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా : ఏదైనా భూమిగాని, ఇళ్లుగాని రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే వాటి లింకు డాక్యుమెంటు, లేదా ఇంటి పట్టాలు, ప్రభుత్వ ఇచ్చిన పట్టాలు ఉండాలి. కానీ ఎలాంటి దస్త్రాలు లేకుండానే ఇంటిపన్ను రసీదుపై రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ శాఖను పక్కదారి పట్టిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు అక్రమంగా అమ్మకాలు : ఈ రిజిస్ట్రేషన్‌ల కోసం అనేక అక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ గ్రామం పక్కనే ఉన్న పాణ్యం గ్రామ పంచాయతీకి చెందిన 1919 సర్వే నెంబరు నుంచి 1939 సర్వే నెంబరు వరకు గల 9.92 ఎకరాల ఏడబ్ల్యూ భూముల్లో విచ్చలవిడిగా స్థలాలు ఆక్రమించుకున్నారు. కొందరు పది సెంట్ల వరకు ఆక్రమించుకొని సెంటు రెండు లక్షల రూపాయలకు అమ్మినట్లు తెలిసింది. ఈ స్థలాలకు తప్పుడు సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలను కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం ఈ స్థలాలలో కొందరు నిజమైన పేదలు ఉన్నా వారికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.




సుగాలిమెట్టలో ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలు

పార్టీల తప్పులే అక్రమ రిజిస్ట్రేషన్లకు కారణం : నరేంద్రనాథ్‌రాజు, సబ్ రిజిస్ట్రార్, పాణ్యం : రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చే పార్టీల తప్పుల వల్లే రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు దొర్లుతున్నాయి.. బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని తప్పుడు సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్‌లు చేయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చిన వాళ్లను వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి నివేదికలతో పాటు స్థల రికార్డులు ఇవ్వాలని అడగడంతో వెనక్కి వెళ్లిపోయారు. కొందరు దళారులు బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని మోసం చేస్తూ రిజిస్ట్రేషన్ అధికారులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. సుగాలిమెట్ట ఇంటికి పాణ్యం గ్రామ కంఠం సర్వే నెంబరువేసి ఆళ్లగడ్డలో రిజిస్ట్రేషన్ చేయించారు. సుగాలిమెట్ట సర్వే నెంబరు ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉండడంతో తప్పుడు సర్వే నెంబరు వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో సబ్ రిజిస్ట్రార్‌కు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంకుల్లో రిజిస్ట్రేషన్ జరిగితే రుణాలు ఇస్తున్నారు. అమాయకులను ఆసరాగా చేసుకొని దళారులు రిజిస్ట్రేషన్‌లను పక్కదారి పట్టిస్తున్నారన్నారు.

విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ

సుగాలిమెట్టలోని ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా స్థలాలు ఆక్రమించుకొని గృహాలు నిర్మించుకుంటున్నారు. వీటిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఈ గృహాలకు పన్ను రశీదులు ఇవ్వాలన్నా సరైన యాజమాన్యపు హక్కులు లేకపోవడంతో పంచాయతీ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో కుటుంబానికి రెండున్నర సెంట్ల స్థలం ఇవ్వాల్సి ఉండగా అక్రమంగా ఒక్కొక్కరు పదినుంచి ఇరవై సెంట్ల స్థలాలను కబ్జా చేసి భవనాలు నిర్మించుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే గ్రామంలో ఎవరికీ ఇంటి పట్టాలులేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కాగా రెవెన్యూ అధికారులు వెంటనే ఈ ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి ఇండ్లు లేని నిరుపేదలకు స్థలాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఆళ్లగడ్డలలో రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు

ఈ పచ్చదనం ప్రమాదకరం..!



చూడటానికి పచ్చగా ఎంత అందంగా ఉందో కదా ఈ దృశ్యం. కానీ ఈ పచ్చదనం చాలా ప్రమాదకరమంటే నమ్మశక్యంగా లేదు కదూ. సుందరంగా కనిపిస్తున్న ఈ పచ్చదనమంతా గుర్రపుడెక్క. కోడుమూరు మండలంలోని అమడగుంట్ల గ్రామంలో ఉన్న నీటికుంట మొత్తం ఇలా గుర్రపుడెక్కతో నిండిపోయింది. నిజానికి ఇది ఎంతో ప్రమాదకరం. నీటి ప్రవాహం ఆగిపోయి కలుషితం కావడంతో పాటు... గుర్రపుడెక్క నుంచి వచ్చే గాలి కూడా ప్రమాదకరమే అంటున్నారు పర్యావరణ నిపుణులు. అంతేకాదు ఈ పచ్చదనం దోమలకు నివాసాలుగా కూడా ఉంటాయి.

- కోడుమూరు రూరల్.

కష్ట జీవుల గడ్డిపరుపు..!



వ్యవసాయ పనులపై ఆధారపడి జీవనం సాగించే కూలీలకు రోజువారీ పనులు లేనిదే పూట గడవని పరిస్థితి. ఎన్ని కష్టాలున్నా వారికి పల్లెటూరే ప్రపంచం. ఆ మట్టిమనుషులే వారి ఆత్మీయ బంధువులు. శనివారం కోసిగి మండలకేంద్రంలో పశుగ్రాసం ట్రాక్టర్లపై సుమారు 20 మందికి పైగా కూలీలు పనులన్నీ పూర్తి చేసుకుని సాయంత్రం వేళ ఇలా హాయిగా వెళ్తూ కబుర్లు చెప్పుకుంటూ ఇళ్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారికి పశుగ్రాసమే పరుపుగా మారింది. - కోసిగి

సొంత ఊరికోసం..!



- ప్రభుత్వ కార్యాలయాల స్థల దాత
- 12 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు
- రెండెకరాల్లో పాఠశాల నిర్మాణం
- ఏటా వంద ఉచిత వివాహాలు



కేజీబీవీ పాఠశాల

తుగ్గలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సొంతూరికి సేవ చేయాలని ఎంతోమందికి ఉంటుంది. కానీ కొంతమందికి మాత్రమే ఆ అవకాశం దక్కుతుంది. ఆ కోవలోకే వస్తారు... తుగ్గలి మండల కేంద్రానికి చెందిన తుగ్గలి నాగేంద్ర. సొంతూరిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భూములను ఇవ్వడం, పేదలకు పెళ్లిళ్లు, మండలంలోని పేదలకు ఇంటి స్థలాలు... ఇలా సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్తున్నారు. తుగ్గలి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఇచ్చిన స్థలాలన్నీ ఆయనవే. ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయ, ఏపీవో, వెలుగు, హౌసింగ్, పశువైద్య కార్యాలయాలన్ని ఆయన ఇచ్చిన స్థలాల్లో నిర్మించినవే. కేజీబీవీ నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించిన ఘనత కూడా ఆయనదే. అంతేకాదు ఏకంగా 12 ఎకరాలు కొని పేదలకు పంచిపెట్టారు. అలాగే ప్రతి ఏటా వంద ఉచిత వివాహాలు చేస్తూ పేదల మనిషిగా పేరు తెచ్చుకున్నారు.

మండల కేంద్రమైన తుగ్గలికి చెందిన కుమ్మరి సుంకన్న రెండో కుమారుడు తుగ్గలి నాగేంద్ర. ఫ్యాక్షన్ నేపథ్యంలో తన చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయారు. అయినప్పటికీ తనను నమ్ముకున్న వారి కోసం బడుగు, బలహీన వర్గాల కోసం ప్రత్యర్థులకు ఏమాత్రం వెరవకుండా మండలంలోనే నిలబడిపోయారు. తాను సంపాదించిన దాంట్లో పేదల కోసం విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు.

670 మందికి సొంత స్థలం

పేదలకు కల్పించడం కోసం గ్రామం ఆనుకుని రూ.కోట్లు వెచ్చించి నాలుగేళ్ల క్రితం 12 ఎకరాలు కొన్నారు. అందులో 670 మంది పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు రిజిస్టర్ చేయించారు. ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆ స్థలాల వరకు సీసీ రోడ్డు వేయించారు.

కేజీబీవీకి రెండెకరాల స్థలం

మండలానికి కేజీబీవీ బాలికల పాఠశాల మంజూరు కావడంతో స్థలం ఇస్తే.. పాఠశాలను నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పింది. దీంతో తుగ్గలి నాగేంద్ర స్పందించి రెండెకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. దీంతో అక్కడ కేజీబీవీ పాఠశాల నిర్మించడంతోపాటు ఇంటర్ కాలేజీ కూడా నిర్మించారు.

పేదల కోసమే నా జీవితం



పేదరికంలో పుట్టి.. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పెద్దల ఆశీస్సులతో ఈ స్థాయికి ఎదిగాను. నాకున్న దేవుడు ఇచ్చిన సంపదలో ఖర్చు చేస్తున్నాను. భవిష్యత్తులో పేదల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తాను. ఏ సమయంలోనైనా ఆపదలో ఉన్నవారు వస్తే నా వంతు సహాయ సహకారాలు అందిస్తా.

- తుగ్గలి నాగేంద్ర

ప్రభుత్వ కార్యాలయాలకూ..

మండల కేంద్రమైన తుగ్గలిలో ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయం, ఏపీవో, వెలుగు, హౌసింగ్, పశువైద్య కార్యాలయాలకు స్థలాలను తుగ్గలి నాగేంద్ర ఇచ్చారు. ప్రధాన కూడళ్లలో రూ.లక్షల్లో విలువ చేసే స్థలాలు ఉన్నాయి. ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి స్థలాలు ఇచ్చి స్ఫూర్తిగా నిలిచారు.

శ్రీరామనవమికి ఉచిత వివాహాలు

ఏటా తుగ్గలిలో జరిగే శ్రీరామనవమికి పేద యువతీ యువకులకు ఉచితంగా వివాహాలు చేసి వారికి పట్టువస్త్రాలు అందిస్తుంటారు. ఏడాదిలో ఏరోజైన నాగేంద్ర ఇంటికి వెళితే పెళ్లి వస్త్రాలతోపాటు తాళిబొట్లు, మెట్టెలు కూడా తుగ్గలి నాగేంద్ర అందిస్తూ వస్తున్నారు. ఒకే రోజు దాదాపు వంద వివాహాలు చేసి ఆ రోజు అయ్యే ఖర్చునంతా భరిస్తున్నారు. ఇలా పెళ్లి చేసుకోలేని పేదలకు అండగా నిలుస్తున్నారు.



తుగ్గలిలోని స్త్రీశక్తి భవనం



నూతన వధూవరులతో తుగ్గలి నాగేంద్ర దంపతులు (ఫైల్)

కొల్లగొడుతున్నారు..!

(5వ పేజీ తరువాయి)



ఆదోని మండలం ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.1 పరిధిలో 500 క్యూబిక్ మీటర్ల ఎర్రగరుసు తవ్వకాలకు 90 రోజులకు తాత్కాలిక అనుమతి (టీపీ) ఇచ్చిన మాట నిజమేనని గనులు, భూగర్భ వనరుల శాఖ డీడీ రవిచంద్ర తెలిపారు. అయితే ఆ అనుమతి గడువు ఈ నెల మూడో తేదీతో ముగిసింది. గడువు ముగిశాక పాత ఎన్‌వోసీ, టీపీ చిత్తుకాగితాలతో సమానం. అవి ఏమాత్రం చెల్లవని వివరించారు. ప్రస్తుతం ఎవరైనా గరుసు తవ్వకాలకు అనుమతులు కావాలంటే స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అస్సెస్మెంట్ అథారిటీ (ఎస్‌ఈఏఏ) జారీ చేసే పర్యావరణ అనుమతులు (ఈసీ) తప్పనిసరిగా ఉండాలి. ఈసీ అనుమతులు లేకుండా ఎర్రమట్టి, ఇసుక తవ్వకాలు ఎట్టి పరిస్థితుల్లో చేపట్టకూడదని జాతీయ గ్రీన్ ట్రైబ్యూనల్ (ఎన్‌జీటీ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇందుకు విరుద్ధంగా ఆదోనిలో యంత్రాలతో ఎర్ర గరుసు తవ్వకాలను చేపడుతున్నారు. మైనింగ్ నిబంధనలు ఇంతస్పష్టంగా ఉంటే.. 20 రోజుల క్రితమే మైనింగ్ అధికారులు ఇచ్చిన తాతాల్కిక అనుమతి (టీపీ) గడువు ముగిసినా.. మాకు ఎన్‌ఓసీ ఉందని, మైనింగ్ అధికారుల పర్మిషన్ పేరిట ఎస్.కొండాపురం కొండల్లో ఎక్స్‌కవేటర్లతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఓ పక్క సీఎం చంద్రబాబు నాయకుడు మద్యం, మట్టి, ఇసుక జోలికి వెళ్లవద్దని ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులకు స్పష్టంగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సీఎం ఆదేశాలను తెలుగుతమ్ముళ్లు ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఈసీ క్లియరెన్స్, మైనింగ్ అనుమతులతో ఖజానాకు రాయల్టీ చెల్లించి ఎర్రమట్టి తవ్వకాలు, రవాణా చేస్తే ఎవరు కాదనరు. అధికారం ఉంది కాదని ఇష్టారాజ్యంగా కొండల్ని తవ్వేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రైతుల గోడు పట్టదా..?:

ఆదోని పట్టణం బండిమెట్ట ప్రాంతానికి చెందిన బీసీ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బోయ సరోజమ్మ, కుమారుడు బోయ శ్రీనివాసులుకు ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు.116లో 3.40 ఎకరాలు పొలం ఉంది. మా పొలం పక్కనే కపటి గ్రామానికి చెందిన మాధవ్ ఎక్స్‌కవేటరుతో అక్రమంగా గరుసు తవ్వకాలు చేస్తూ నాలుగు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. గరుసు తవ్వకాలు వల్ల మా పొలం కోతకు గురవుతుందని చెప్పిన మా గోడు పట్టించుకోవడం లేదు.. గరుసు తవ్వకాలు ఆపేసి మాకు న్యాయం చేయాలంటూ తల్లికొడుకులు బోయ సరోజ, శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సూచన మేరకు సబ్ కలెక్టరు మౌర్యభరద్వాజ్, తహసీల్దారు శివరాముడును కలసి ఫిర్యాదు చేశారు. రైతు గోడును ఆంధ్రజ్యోతి వార్తగా ప్రచురించింది. గరుసు తవ్వకాలు చేస్తున్న కపటి టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మాధవ్.. టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మకు సన్నితుడని స్థానికులు అంటున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అనుమతితో తవ్వకాలు చేస్తున్నారనే పట్టణంలో చర్చించుకుంటున్నారు. అక్రమ గరుసు తవ్వకాల వల్ల తన పొలం కోతకు గురవుతోందని, న్యాయం చేయాలంటూ వాల్మీకి(బీసీ) సామాజిక వర్గానికి చెందిన రైతు శ్రీనివాసులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. పదే పదే బీసీ కార్డు ఉపయోగించే నేతలకు అదే బీసీ రైతు గోడు పట్టదా? అంటూ పలువురు పేర్కొంటున్నారు.

మైనింగ్ పర్మిషన్ ఉంది



అనుమతులు తీసుకుని గరుసు తవ్వకాలు చేపట్టాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి చెప్పారు. ఆయన అనుమతితోనే టీడీపీ నాయకుడు మాధవ్‌కు ఎస్.కొండాపురంలో గరుసు తవ్వకాలు చేసుకోవాలని చెప్పాం. మాధవ్ పేరిట ఈ ఏడాది సెప్టెంబరు 5న మైనింగ్ అధికారులు టెంపరరీ పర్మిషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో పర్మిషన్‌తో తవ్వారో లేదో మాకు తెలియదు.. మేము మాత్రం పర్మిషన్ తీసుకొనే తవ్వకాలు చేస్తున్నాం. బీసీ మహిళా నాయకురాలిగా 20 ఏళ్లగా కార్యకర్తల కోసం పోరాడుతున్నాను. అన్ని పర్మిషన్లు తీసుకొని తవ్వకాలు చేస్తున్నాం. నేను ఎట్టి పరిస్థితిలో అవినీతిని ప్రొత్సహించను.

- గుడిసె కృష్ణమ్మ, టీడీపీ నాయకురాలు, ఆదోని

తవ్వకాలకు అనుమతులు లేవు



ఆదోని మండలం ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.1 పరిధిలో 500 క్యూబిక్ మీటర్ల గరుసు తవ్వకాలకు ఇచ్చిన తాత్కాలిక అనుమతి (టీపీ) గడువు ఈ నెల 3న ముగిసింది. ప్రస్తుతం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతి లేకుండా గరుసు తవ్వకాలు చేయడం నేరమే అవుతుంది. విచారించి కఠిన చర్యలు తీసుకుంటాం. నేషనల్ గ్రీన్‌ట్రైబ్యూనల్ ఆదేశాల మేరకు పర్యావరణ అనుమతి (ఈసీ) ఉంటేనే గరుసు తవ్వకాలకు టెంపరరీ పర్మిషన్ ఇస్తారు. ఈసీ అనుమతి లేకుండా ఎవరికి అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదు.

- రవిచంద్ర, డీడీ, మైనింగ్ శాఖ, కర్నూలు

మహానందిలో 'కార్తీక' సందడి



మహానంది కోనేరులో భక్తులు

మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం మహానందిలో కార్తీకమాసం సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు కార్తీకమాసం పురస్కరించుకుని మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అసభ్యకర పోస్టుల ఎఫెక్ట్..!

చిత్తూరు పోలీసుల కస్టడీలో మహానంది వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజుపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన జగన్‌కృష్ణ చిత్తూరు రెండో పట్టణ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. సీఎం, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ గౌరవానికి భంగం కలిగించే విధంగా అసభ్యకర పోస్టు పెట్టాడంటూ ఈ నెల 10వ తేదీన టీఎన్ఎస్ఎఫ్ నేత గోకుల కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో నంద్యాల జిల్లా మహానంది మండలంలోని యు. బండపల్లెకు చెందిన జగన్ కృష్ణను 13వ తేది చిత్తూరు పోలీసులు అదుపులోకి తీసుకుని అదే రోజు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రిమాండ్ విధించింది. కర్నూలు జిల్లా నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై కస్టడీకి తీసుకున్న మన్యం పార్వతీపురం జిల్లా పోలీసులు కోర్టులో హాజరుపరిచి బొబ్బిలి జైలుకు తరలించారు. కోర్టు అనుమతి మేరకు తిరిగి శనివారం అక్కడ నుంచి చిత్తూరు రెండో పట్టణ పోలీసులు కస్టడీకి తీసుకున్నట్లు సమాచారం. సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడం వెనుక ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో విచారించడానికి కస్టడీకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

మహానంది ఆలయ పర్యవేక్షకుడిగా శశిధర్‌రెడ్డి



మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ సీనియర్ అసిస్టెంట్ అంబటి శశిధర్‌రెడ్డికి దేవస్థానం పర్యవేక్షకుడిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. గత 35 సంవత్సరాలుగా మహానంది దేవస్థానంలో వివిధ విభాగాల్లో పనిచేసిన శశిధర్‌రెడ్డికి సీనియారిటీ ప్రతిపాదికన పర్యవేక్షకుడిగా పదోన్నతి కల్పించినట్లు చెప్పారు. ఈమేరకు పలువురు ఆలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు

బలహీన వర్గాల పురోభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి ● బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత





శంఖారావం కార్యక్రమానికి తరలివచ్చిన బీసీలు

కర్నూలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి రూ.29 వేల కోట్ల నిధులు కేటాయించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని, రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల పురోభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అహరహం కృషి చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. శనివారం నగరంలోని నందికొట్కూరు రోడ్డులోగల ఆదర్శ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బీసీ శంఖారావం పేరుతో, వనభోజన మహోత్సవ రాష్ట్ర మహాసభను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వర రావు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడుతూ ఆనాడు ఎన్టీఆర్ బీసీలకు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ పట్టం కట్టడం వల్లే నేడు ఇలా వేదికలు ఎక్కగలుగుతున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని రూ. వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్ తీర్చిదిద్దబోతున్నారని అన్నారు. 33 శాతం చట్ట సభల్లో బీసీలకు అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మరో అతిథి ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి రూ.2లక్షల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు తమ పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించాలని సూచించారు. కర్నూలు, అనంతపురం ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబికా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీలు ఎంతో నష్టపోయారని, ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఒక్కసారైనా బీసీ సామాజిక వర్గం వారు కావాలని అన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్ బాలాజీ, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, రాష్ట్ర టీడీపీ బీసీ విభాగం మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, బత్తిని వెంకట్రాముడు, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జేఏసీ ఛైర్మన్ వరప్రసాద్, కురువ, రజక కార్పొరేషన్ల ఛైర్మన్లు గోవిందప్ప, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, విశ్రాంత ప్రిన్సిపాల్ బి. తిమ్మయ్య తదితరులు హాజరయ్యారు.



వేదికపై ఐక్యతచాటుతున్న బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

బదిలీల్లో బాధితులు

- గృహ నిర్మాణ శాఖలో గందరగోళం
- ఉన్నతాధికారుల ఉత్తర్వులు చెల్లవట?
- సమస్యను నాన్చుతున్న అధికారులు

కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా గృహనిర్మాణ శాఖ బదిలీల్లో గందరగోళం నెలకొంది. నెల రోజుల క్రితం జిల్లాలో జరిగిన వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ అపరేటర్ల బదిలీలు ఆ శాఖ ఉద్యోగుల్లో అయోమయాన్ని సృష్టించాయి. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన గృహనిర్మాణ శాఖ పీడీ సిద్ధలింగమూర్తి దాదాపు 24 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 11 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు, 13 మంది అపరేటర్లు ఉన్నారు. ఆ తరువాత ఆయన ఇక్కడి నుంచి మ్యాత శాఖకు బదిలీపై వెళ్లారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా బదిలీలు అయిన వెంటనే సంబంధిత ఉద్యోగులు తమకు నూతనంగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరి, దాదాపు 15 రోజుల పాటు అక్కడ పనిచేశారు. కొద్ది రోజుల తర్వాత ఈ బదిలీలు చెల్లవని, వీటిని అమలు చేయటం కుదరదంటూ కార్యాలయ వర్గాలు కొర్రీ వేసి, వారిని పూర్వ స్థానాలకే వెళ్లాలని ఆదేశించారు. దీంతో ఆ ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు.

ఉన్నతాధికారుల ఉత్తర్వులు చెల్లవా?: దీర్ఘకాలికంగా ఒకే స్థానంలో పాతుకపోయిన ఉద్యోగులను కదిలించటతో పాటు, దూర ప్రాంతంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు ఎంతో కొంత వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో వారి విన్నపం మేరకు పీడీ ఈ బదిలీలను చేపట్టారు.



నిర్మాణ దశలో ఉన్న గృహాల వద్ద లబ్దిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ సిబ్బంది (ఫైల్)

కానీ ఈ ఉద్యోగులకు ఉత్తర్వు కాపీలను అందజేసిన ఉన్నతాధికారులు, వాటిని బాధ్యులైన అధికారులకు అందజేయటంలో తాత్సారం చేశారు. ఆ తర్వాత పీడీ బదిలీ అయ్యారు. దీంతో సమస్య జటిలంగా మారింది. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రానందున విధుల్లో చేర్చుకోలేమని ఉద్యోగులకు అధికారులు తేల్చి చెప్పారు. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు పాత స్థానానికి దూరమై, కొత్త పోస్టులో చేరలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వీరు చేరాల్సిన స్థానాలలో అప్పటికే ఉన్న సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక బదిలీ అయిన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నాన్చుడు ధోరణితో నష్టం: ఉద్యోగుల అభిప్రాయాలు, అవసరాలు, అభ్యర్థన మేరకు జరిగిన బదిలీల్లో సాంకేతిక తప్పిదంతో బదిలీ అయిన వాళ్ల త్రిశంకు స్వర్గంలో ఉండే పరిస్థితి ఏర్పడింది. వాళ్లను పాత, కొత్త స్థానాలకు తిప్పుతూ వేదనకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం బాధ్యతల్లో ఉన్న ఉన్నతాధికారులు, కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తే సమస్య కొలిక్కి వస్తోంది. కానీ వారు ఏ నిర్ణయం తీసుకోకుండా నాన్చివేత వైఖరితో ఉన్నారు. పీడీ పరిధిలో తేల్చాల్సిన అంశాన్ని కలెక్టర్ పేరుతో ఎటూ తేల్చడం లేదనే పలు విమర్శలకు తావిస్తోంది. దీని వల్ల గృహ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వంద రోజుల ప్రణాళిక లక్ష్యం నీరు గారుతోంది. ఉన్నతాధికారులంతా కలిసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వినతిపత్రాన్ని నివేదించటం కొసమెరుపు.

- **ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం**

ఎన్టీయార్ గృహ నిర్మాణానికి సంబంధించి ఇంటింటి సర్వే ఇంకా అసంపూర్తిగా ఉండటంతో ఆ పనులు పూర్తికాగానే బదిలీల అంశాన్ని ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటికే ఈ విషయమై ఇన్‌ఛార్జి పీడీ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే అర్హులైన వారందరికీ బదిలీలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

- మద్దయ్య, గృహనిర్మాణ శాఖ మేనేజర్, కర్నూలు

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం



మాట్లాడుతున్న జేసీ డా.బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారాన్ని ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకు నిర్వహించాలని శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య జిల్లా స్థాయి కోర్ కమిటీ సమావేశంలో అధికారులను ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ లింగ వివక్షకు అవకాశం లేకుండా ఉండాలని పీఎన్డీటీ యాక్టును అమలు చేయడం జరుగుతోందన్నారు. అమ్మాయిలు 18 సంవత్సరాలు వయస్సు వచ్చేవరకు వివాహనం చేయరాదన్నారు. జిల్లా సమాఖ్య అన్ని మండల సమాఖ్యలు, అన్ని గ్రామాల సంఘాలు అందరూ స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ శివలీల, జాయింట్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ రంగ లక్ష్మీదేవి, డీఐపీ ఆర్వో జయమ్మ, డీఈవో శ్యామూల్ పాల్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ శస్త్రచికిత్సపై వర్క్‌షాపు



నూతన ఈఎన్‌టీ వైద్యులకు శిక్షణ ఇస్తున్న డా. జయప్రకాష్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలోని ఎన్ఆర్‌పేటలో శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో 34వ హ్యాండ్స్ ఆన్ ఆసిక్యూల్ ప్లాస్టీ, టింపనో ప్లాస్టీ, మైక్రోఇయర్ సర్జరీ ఈఎన్‌టీ శస్త్ర చికిత్సపై రెండు రోజుల వర్క్‌షాపు శనివారం ప్రారంభమైంది. గత 15 సంవత్సరాలుగా ఈఎన్‌టీ శస్త్ర చికిత్స వర్క్‌షాపును శ్రీసత్యసాయి బాబా పుట్టిన రోజు సందర్భంగా ఏటా నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్ అధినేత డా. జయప్రకాష్ రెడ్డి తెలిపారు. వర్క్‌షాపులో ఈఎన్‌టీ శస్త్ర చికిత్సలపై నూతన వైద్యులకు శిక్షణతోపాటు వృత్తిపరమైన మెలకువలు అందిస్తారన్నారు. ఈఎన్‌టీ వైద్యులు డా.మహేంద్రకుమార్, డా. నదీమ్ (బెంగుళూరు), డా.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డా. కుమార్ చౌదరి శిక్షణ అందిస్తారని తెలిపారు.

వసతి గృహాల మరమ్మతులకు రూ.కోటి కేటాయింపు



ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీబీసీడబ్ల్యూవో వెంకట లక్ష్మమ్మ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లు, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల మరమ్మతుల కోసం తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.కోటి కేటాయిస్తున్నట్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రకటించారని డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజులకు శనివారం పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై చర్చించారు. నిధులు ప్రకటించిన ఎంపీకి డీబీసీడబ్ల్యూవో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లస్కర్ మృతి

నందికొట్కూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల రోడ్డులో ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ వద్ద లారీ కింద పడి లస్కర్ మృతి చెందారు. నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన పెద్ద చెంచు నాగన్న(52) జలవనరుల శాఖలో లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ముచ్చుమర్రిలోని తన నివాసం నుంచి బియ్యం కొనుగోలు చేసేందుకు నందికొట్కూరుకు వచ్చారు. రైస్ మిల్లు వద్దకు వెళ్తుండగా ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా నంద్యాల నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో పెద్ద చెంచు నాగన్న అక్కడికక్కడే మృతి చెందారు. పెద్ద చెంచు నాగన్నకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డిపో మేనేజర్లకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆపరేషన్ ఈడీ అప్పలరాజు

కర్నూలు రూరల్ నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో శనివారం కర్నూలు, నంద్యాల జిల్లాల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జీలకు ఆపరేషన్‌పైన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర కార్యాలయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్) అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణా తరగతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆపరేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, రజియాసుల్తానా, నంద్యాల ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి ప్రాధాన్యత

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్. బాలాజీ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్.బాలాజీ అన్నారు. శనివారం నగరంలోని వెంకటరమణ కాలనీ పున్నమి అతిథి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కర్నూలు డివిజన్ పరిధిలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ప్రస్తుతం పర్యాటక ప్రదేశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, యూనిట్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

కర్నూలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు వినయ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. డోన్ పట్టణం కొండపేటకు చెందిన వినయ్ కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 12 మోటారు సైకిళ్లు, ఒక ఆటో, నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటారు సైకిల్లను చోరీ చేశాడు. పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి 12 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు : డీఎస్పీ



విద్యార్థినులను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన చదువులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని యు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఇష్టాగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఫెన్సింగ్ క్రీడలో జాతీయ స్థాయికి వెళ్లడం అభినందనీయమన్నారు. రెండేళ్లుగా జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులలో యు.కొత్తపల్లి పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని అన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను డీఎస్పీ అభినందించారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న యువకుడి కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

యువకుడి అనుమానాస్పద మృతి

- న్యాయం చేయాలని రోడ్డుపై కుటుంబ సభ్యుల ధర్నా

నందికొట్కూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెం కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్(23) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో ముచ్చుమర్రి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన నిలిపిన ఓ వాహనంలో యువకుడి మృతదేహం ఉండడాన్ని స్థానికులు చూసి యువకుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. యువకుడి తండ్రి దేవదాసు, తల్లి ఏస్తేరమ్మ, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించారు. మూడు రోజుల నుంచి కనిపించడం లేదని చెప్పారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, పట్టణ సీఐ ప్రవీణ్ కుమారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని యువకుడి కుటుంబ సభ్యులతో చర్చించి న్యాయం జరిగేలా విచారణ చేపడతామని తెలిపారు. దీంతో ధర్నా విరమించారు. కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి పరిశోధించారు. జాగిలాలు కనిపెట్టిన జాడపై పోలీసులు విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పత్తి రైతుల గోడు పట్టించుకోవాలి



పెంచికలపాడు సీసీఐ కేంద్రం వద్ద రైతు సంఘం ప్రతినిధుల నిరసన

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ సీసీఐ పత్తి రైతుల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కల్పించుకుని కేంద్ర ప్రభుత్వం ద్వారా సీసీఐ పెడుతున్న నిబంధనలను సడలించేలా చూడాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కోరారు. శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పెంచికలపాడులోని సీసీఐ కేంద్రం వద్ద ధర్నా చేపట్టారు. జగన్నాథం మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్ల పూర్తిగా దిగుబడి తగ్గిపోయి పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి సాగులో రైతులకు పెట్టుబడి ఖర్చులను పరిగణనలోకి తీసుకుని క్వింటానికి రూ.10వేల మద్దతు ధరను అందించేందుకు సీఎం చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణ నాయక్, పుల్లన్న, దొడ్డిపాడు బాషా, వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.

నేడు 'జబర్దస్త్' కళాకారుల ప్రదర్శన

కర్నూలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'జబర్దస్త్' టీవీ కళాకారులతో హాస్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహ్మద్ మియా తెలిపారు. జబర్దస్త్ హాస్య కార్యక్రంలోని టీవీ నటులు జబర్దస్త్ అప్పారావు, వినోదిని, గుండు మురళీధర్, నవీన్, అల్లరి అర్జున్, ఎస్ఎస్ ప్రసాద్‌లు ఈ హాస్య ప్రదర్శనలు ఇస్తారని వారు పేర్కొన్నారు.

పిల్లలకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న మలేరియా జిల్లా అధికారి నూకరాజు

కోడుమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్లలో 5 సంవత్సరాల వయస్సులోపు పిల్లలకు ఆరోగ్య సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. స్థానిక 18వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పిల్లలకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో, 18 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో 44 రకాల ఆరోగ్య సమస్యలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి 4డీఎస్ పుట్టుకతో వచ్చే లోపాలు, పౌష్టిక ఆహార లోపాలు, తరచుగా వచ్చే రోగాలు, వయస్సుకు తగ్గ శారీరక మానసిక పెరుదల, అంగవైకల్య లక్షణాలు, కౌమార దశలోని వచ్చే వ్యాధులను గుర్తించి అందుకు సంబంధించిన చికిత్సను అందిస్తామని చెప్పారు. అలాగే ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు పైబడిన వాళ్లకు షుగర్, బీపీ, నోటి, రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్ పరీక్షలను చేస్తామన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది నరసప్ప, కమాల్ సాహెబ్, ఆరోగ్య కార్యకర్తలు సుగుణమ్మ, అంగన్‌వాడి వర్కర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

పెసరవాయి ఉప సర్పంచ్ పదవికి రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామా పత్రం అందిస్తున్న సాయిసుధ

గడివేముల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన 10వ వార్డు మెంబర్ సాయిసుధ ఉప సర్పంచ్ పదవికి శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వాసుదేవగుప్తాకు అందజేశారు. తన వ్యక్తిగత కారణాల వల్ల ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేశానని అన్నారు. వార్డు మెంబర్‌గా కొనసాగుతానని చెప్పారు.

26న దేశవ్యాప్త నిరసనలు

ఆత్మకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26వ తేదిన దేశవ్యాప్తంగా తలపెట్టిన నిరసనలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కార్యక్రమానికి జయప్రదం చేయాలని పిలుపునిస్తూ నిర్వహించిన ఆటో ప్రచార జాతాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద రోజువారి వేతనం రూ.600తో 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. అదేవిధంగా కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు మార్చడం సరికాదని అన్నారు. అలాగే కార్మికులందరికి రూ.26వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలన్న డిమాండ్లతో చేపట్టబోవు దేశ వ్యాప్త నిరసనలను విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 26న నంద్యాల లోని నూనెపల్లి సెంటర్ నుంచి కార్మిక, కర్షకులతో జరిగే ప్రదర్శనను విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో వివిధ సంఘాల నాయ కులు నరసింహ నాయక్, రణధీర్, రామ్‌నాయక్, రజాక్, నాగేశ్వర రావు, సామేలు, గోపాలకృష్ణా తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

పగిడ్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం లోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సాయివిజేయ అలియాస్ చాపల విజయుడు (66) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నియోజకవర్గ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి విజేయుడు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలి: ఎమ్మెల్యే



నందికొట్కూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాభి వృద్ధికి అందరూ తమవంతుగా తోడ్పాటునందించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. శనివారం నందికొట్కూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది, మండల స్థాయిలో అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో వీధుల్లో తిరిగి ఎక్కడ ప్రజా జీవనానికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, మౌలిక వసతులు కలించాలని సూచించారు. అలాగే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీని వాసులు, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి. అధికారులు నాయకులు పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లిపోయారు..!

- నామమాత్రంగా సాగిన ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం
- గైర్హాజరైన పలు శాఖల అధికారులు



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం చప్పగా సాగిందన్న విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా 11.30 గంటలకు కూడా ఎంపీపీ తిరుపాలమ్మ, ఎంపీడీవో సుబ్రమణ్యం, తహసీల్దార్లు రత్నరాధిక తదితర అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. ముందుగానే అక్కడికి చేరుకున్న వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వేచిఉండాల్సిన దుస్థితి నెలకొంది. కాగా సమావేశం ప్రారంభమైన తర్వాత రెండు, మూడు శాఖలకు సంబంధించి ఒకరిద్దరు తప్ప మిగతా ప్రజాప్రతినిధులెవరూ సమస్యలపై గళం వినిపించిన దాఖలాల్లేవు. ప్రత్యేకించి విద్యార్థుల అపార్ నమోదు జరుగుతున్న సమస్యలను కోఆప్షన్ సభ్యులు మౌలాలి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆ సమస్య గురించి తహసీల్దార్ రత్నరాధిక వివరణ ఇచ్చారు. మిగతా శాఖల అధికారులు తమ శాఖలోని పథకాలు, పనితీరు గురించి వివరించి వెళ్లిపోయారు. కాగా విద్య, వెలుగు, అటవీ, ఆర్టీసీ తదితర శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులు సమావేశానికి గైర్హాజరై తమ శాఖ తరపున కింది స్థాయి సిబ్బందిని సమావేశానికి పంపించారు. పోలీసు శాఖ నుంచి ఎవరూ హాజరు కాలేదు. అదేవిధంగా జడ్పీటీసీ శంకరరెడ్డితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా మండల మీట్‌కు రాలేదు. కొందరు మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి భర్తలు సమావేశానికి హాజరయ్యారు. మొత్తా నికి ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే మండల మీట్ మొక్కుబడిగా జరిగిందే తప్ప ప్రయోజనమేమి లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ సమావేశానికి ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కీరయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో నాగమ్మ, బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల్, పీఆర్ ఏఈ సుబ్బయ్య, ఎఫ్ఎస్‌వో స్వరూప్ హాజరయ్యారు.

వెలుగోడులో తూతూమంత్రంగా..



ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

వెలుగోడు నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వెలుగోడులోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఎంపీపీ రమేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమస్యలపై వెలుగోడు సర్పంచ్ జయపాల్, మాధవరం సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ నసీరుద్దీన్‌బాబు అధికారులను నిలదీశారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కాకపోతే ఇక సమావేశాలు ఎందుకు? అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవి పందులు రైతుల పంటలను నాశనం చేస్తుంటే అటవీశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశానికి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు అధికశాతం హాజరు కాలేదు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఈవోఆర్డీ మురారి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్ర శత జయంతి సభ



ఆరుద్ర చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రచయితలు

పాణ్యం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆరుద్ర శత జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో తన రచనల ద్వారా సామాన్యుని నుంచి అసామాన్యునిగా ఎదిగిన సాహితీ సృజనశీలి ఆరుద్ర అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, కవులు మాబుబాషా, ప్రసాద్, రఫీ, స్రవంతి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫార్మసిస్టుల సేవలు మరువలేనివి'



శాంతిరాం ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపాల్

పాణ్యం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో ఫార్మసిస్టుల సేవలు మరువలేనివని ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు అన్నారు. శుక్రవారం శాంతిరాం ఫార్మసీ కళాశాలలో 2007 నుంచి 2016 వరకు చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఉద్యోగ అవకా శాల కల్పించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేదవతి, యువరాజ్ సింగ్, బాలయ్య, విశ్వనాథ్, బాలచంద్రుడు, చిన్న, కోటేశ్వరరెడ్డి, దివ్య, కిరణ్ కుమార్, కిషోర్, పక్కీర, మద్దిలేటి, చందు, అనిల్, వినీత, కళాశాల అధ్యాపకులు, కోఆర్డినేటర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో యువత కొత్తగా ఓటు నమోదును సద్విని యోగం చేసుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. శనివారం ఆమె ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని 40, 50, 51, 52 ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 23, 24 (శని, ఆదివారాలు) తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి

కొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి తెలిపారు. దుద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం కృష్ణమోహన్ అధ్యక్షతన శనివారం గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే అంశంపై పిల్లలపై జరిగే నేరాలు, బాల్య వివాహాల గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన ఆర్డీవో నాగజ్యోతి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించి వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలే తప్ప.. బాల్యవివాహాలు చేసి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు. విద్యార్థులు కూడా కష్టపడి చదువుకోవాలన్నారు. తహసీల్దార్ ఉమారాణి మాట్లాడుతూ తల్లిదండ్రులు బలవంతంగా వివాహాలు చేస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా తెలియజేస్తే వాటిని అడ్డుకుంటామని తెలిపారు. కొత్తపల్లి ఎస్‌ఐ కేశవ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలపట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీఆర్వో లింగస్వామి, మహిళా పోలీసు శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జయప్రదం చేయండి'

ఆత్మకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబరు 7వ తేదిన మెగా టీచర్స్ - పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని మండల విద్యాశాఖాధికారి బాలాజీనాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంఈవో కార్యాయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ మీట్‌లో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 7న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మెగా సదస్సును నిర్వహిం చాలన్నారు. అదేరోజు విద్యార్థులకు వారి ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేసి ప్రతి విద్యార్థి గురించి సమీక్షించాలని సూచించారు.

'ఆయిల్ పామ్ సాగుతో లాభాలు'



ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి

వెలుగోడు నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంటల సాగు రైతులకు లాభదాయంకం అని ఉద్యానశాఖ అధికారి చందన అన్నారు. శనివారం వెలుగోడు మండలంలోని మాధవరం గ్రామంలో రైతులు సాగు చేసిన ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నీటి వసతి ఉండి ఆసక్తి గల రైతులకు పతాంజలి కంపెనీ మొక్కలను ఉచితంగా అందిస్తుందని చెప్పారు. వాటి గెలలను కూడా కొనుగోలు చేస్తామని, ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలని 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని అన్నారు. పంటలు సాగు చేస్తున్న రైతులకు హెక్టారుకు రూ 11,500 సబ్సిడీ ఇస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పని చేయాలి: ఏఎస్‌వో



ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఏఎస్‌వో వెంకటేశ్వర్లు

నంద్యాల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు బాధ్యతయుతంగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈఎస్‌వో (ఎలక్షన్ అసిస్టెంట్ సెక్షన్ అధికారి) చిన్న వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌వోల పనితీరును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విభాగం ఆదేశాల మేరకు పోలింగ్ భూతులలో ఓటర్ల నమోదుకు, మార్పులు, చేర్పులు, అక్షర దోషాలు నివారణ, అభ్యంతరాలపై వచ్చే దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలన్నారు. తుది నివేదికలను ప్రభుత్వానికి సమర్పించే నాటికి ఎలాంటి లోపాలు లేకుండా పంపిచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే పోలింగ్ భూతులలో వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ర్యాంప్‌ల ఏర్పాట్లపై, అవసరమైన వసతుల కల్పనకు ఉండాల్సిన సదుపాయాలపై ఆరాతీశారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రియదర్శిని, ఎలక్షన్ డీటీ విజయశేఖర్ తదితరులు ఉన్నారు.

'సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి'



మాట్లాడుతున్న డీఏవో మురళీకృష్ణ

నంద్యాల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. శనివారం నంద్యాల జిల్లా వనరుల కేంద్రంలో ఉప వ్యవసాయ సంచాలకులు సరళమ్మ ఆధ్వర్యంలో నంద్యాల డివిజన్ క్షేత్రస్థాయి సిబ్బందికి నైపుణ్య సామర్థ్యం పెంపుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలకు ఆధునిక వ్యవసాయ సాగు విధానాలను తెలియజేయాలన్నారు. రబీలో సాగుచేసే మినుము, శనగ, వరి తదితర పంటలకు బీమా చేయించాలని స్పష్టంచేశారు. నంద్యాల వ్యవసాయ సహయ సంచాలకులు రాజశేఖర్, ఆర్ఏఆర్ఎస్ డైరెక్టర్ జాన్సన్, వ్యవసాయ అధికారులు ప్రసాదరావు, హేమసుందరరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, స్వాతి, నాగేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, వీహెచ్ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

'మోదీ నాయకత్వంపై విశ్వాసం'



మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు మరోసారి మోదీ నాయకత్వాన్ని విశ్వసించారని, ఇందుకు నిదర్శనం మహారాష్ట్రలో వచ్చిన ఫలితాలే అని బీజేపీ జిల్లా కన్వీనర్ అభిరుచి మధు చెప్పారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయం సాధించడంతో నంద్యాలలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

7న సాయుధ దళాల పతాక దినోత్సవం



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురష్కరించుకొని సాయుధదళాల పతాక స్టిక్కర్స్ కార్ ఫ్లాగ్స్‌లను శ నివారం కలెక్టర్ రాజకుమారి ఆవిష్కరించారు. గత సంవత్సరం 2023 సాయుధ దళాల పతాక దినోత్సవానికి అధికంగా రూ.4,12,000- విరాళాలు అందించిన గుడ్‌షెపర్డ్ స్కూలు ప్రిన్సిపాల్ జెస్సీపాల్ తరుపున కరస్పాండెంట్ శ్యామ్యూల్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్నారూత్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన వారిని సత్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండల సమాఖ్య నూతన కమిటీని ఎంపిక చేసినట్లు వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరమ్మ తెలి పారు. శనివారం స్థానిక వెలుగు కార్యాల యంలో జరిగిన ఈ ఎంపికలో మండల సమాఖ్య అధ్యక్షురాలిగా అనసూయమ్మ (వెంకటాపురం), ఉపాధ్యక్షురాలిగా మల్లికమ్మ, కార్యదర్శిగా శిరీష, సహాయ కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా భ్రమరాంబను సభ్యులు ఎన్నుకున్నట్లు వివరించారు. ఆమె మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన కమిటీ ఇకనుంచి పొదుపు మహిళలకు, ప్రభుత్వానికి వారధిలా వ్యవహరించి పొదుపు మహిళలకు రావాల్సిన రుణాలు, చెల్లింపులపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీని వారు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘాల లీడర్లు, వెలుగు సీసీలు, సిబ్బంది ఉన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ..

పాణ్యం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎంపిక శనివారం జరిగింది. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సుమియోన్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. మండల అధ్యక్షుడిగా మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నిసార్ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శిగా సుజాత, కార్యదర్శులుగా సుదర్శన్, రాము, జిల్లా కౌన్సిలర్‌లుగా కృష్ణా రెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు, కలిముల్లా, జాఫర్, కలాం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● డోన్ న్యాయాధికారి తంగమణి

బేతంచెర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని మహిళలతో పాటు ప్రజలు చట్టాలపై తప్పక అవగాహన కలిగి ఉండాలని డోన్ సబ్‌కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బనగానపల్లె ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం అధ్యక్షతన విధాన్ సే సమాధాన్, జాతయా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు బాలికలపై చేసే అఘాయిత్యాలు, చిన్నచిన్న ఘర్షణలకు పాల్పడుతూ నేరాల బారిన పడుతున్నారని అన్నారు. వాటిని నివారించడానికి మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులను జాతీయ మహిళా కమిషన్, డోన్ మండల న్యాయాధికార సంస్థ సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలపై, బాలికలపై అఘయిత్యాలకు పాల్పడిన కేసులు తదితర కేసులు మెగా లోక్ అదాలత్‌తో పరిష్కారం అవుతుందన్నారు. మండల విద్యాధికారి సోమశేఖర్ మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలను పాఠశాలలకు పంపే విధంగా చూడాలన్నారు. బాలికలను చదివించడం వల్ల సమాజాభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ మాట్లాడుతూ గ్రామాల్లో తెలిసీతెలియక చిన్నచిన్న ఘర్షణలకు పాల్పడి శిక్షణ అనుభవిస్తున్నారన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా చట్టాలు, నేరాలపై అవగాహన పొందవచ్చన్నారు. ఎస్ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు. చిన్న చిన్న ఘర్షణలకు పెద్ద కేసులు నమోదు అవుతాయన్నారు. సమావేశంలో నగర కమిషనర్ హరిప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాదమ్మ, శోభారాణి, ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : పట్టణంలోని న్యాయస్థానంలో డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా న్యాయాధికారి మురళీకృష్ణ సూచించారు. శనివారం కోర్టు కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు వీలున్న అన్ని సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగా హన కల్పించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌పై పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో రాణించాలి


క్రీడాకారులకు మెమెంటోలు అందజేస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో ఆత్మ విశ్వాశంతో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణానికి చెంది న అరుణోదయ యూపీ స్కూల్ విద్యార్థినులు పటాన్ అయినియా, ప టాన్ అయనాలు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రైవేట్ పాఠశా లల యాజమాన్య సంఘం అధ్యక్షుడు అమీర్ బాషా ఆధ్వర్యంలో నం ద్యాల డీఈవో కార్యాలయం వద్ద డీఈవో జనార్దన్‌రెడ్డి క్రీడాకారులను అభినందించి వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విద్యా ర్థినుల తండ్రి అబ్దుల్ అజీజ్, తైక్వాండో కోచ్ చంద్రమౌళి పాల్గొన్నారు.

'పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలి'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యువత ఉన్నత చదువులు చదివి పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలని టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ అన్నారు. దొర్నిపాడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు గడ్డిపాటి యశ్వంత్ కుమార్ చెన్నైలోని విమానయానశాఖలో పని చేస్తూనే.. ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్(ఐఈఎస్) పోటీ పరీక్షలో సత్తాచాటారు. ఆల్ ఇండియా స్థాయిలో 18వ ర్యాంకు సాధించడంతో విద్యార్థి గడ్డిపాటి యశ్వంత్ కుమార్‌ను పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గడ్డిపాటి శివ, న్యాయవాదులు శివ ప్రసాద్‌రావు, రమణయ్య పాల్గొన్నారు.

బీసీలకు అండగా ఉంటా : కేఈ ప్రభాకర్


మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న డోన్ నాయకులు

డోన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఎప్పటికీ అండగా ఉంటానని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. శనివారం కర్నూలు నగ రంలోని సూర్యభగవానుని దేవాలయంలో మాజీ మంత్రి కేఈ ప్రభా కర్‌కు డోన్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్న గౌడు ఆధ్వర్యంలో బర్త్‌డే కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, ఆర్జా రామకృష్ణ, మర్రి చక్రపాణి, ఆలేబాదు పరమేష్, ఎల్లాగౌడు, నాగరాజు గౌడు, మాజీ సర్పంచులు గోసానిపల్లి శ్రీరాములు, ఉడుములపాడు ఆదినారాయణ, యాపదిన్నె రంగన్న, వెంకటాపురం పెద్దయ్య, మల్లెంపల్లి సుంకన్న, అశోక్ పాల్గొన్నారు.

ప్యాపిలి: మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌కు శనివారం టీడీపీ మండల నాయకులు కర్నూలుకు వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అలేబాదు పరమేష్, మాధవరం స్వామి, కంబగిరిస్వామి, దామోదర్‌నాయుడు ఉన్నారు.

పిల్లలకు టీకా వేయించాలి

బనగానపల్లె , నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా రెడ్‌క్రాస్ సొసైటీ, కాత్యాయని మెడికల్ అండ్ సర్జికల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన టీకా వైద్య శిబిరాన్ని బీసీ ఇందిరమ్మ ప్రారంభించారు. చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఆనంద్ పర్యవేక్షణలో చిన్న పిల్లలకు ఎంఎంటీ టీకా వేశారు. కార్యక్రమంలో కాత్యాయని మెడికల్ యజమాని మారుతీకుమార్, డాక్టర్ ఆనంద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, సభ్యులు నాగరాజు, ఉస్మాన్‌బాష, సైపుల్లా, హనుమంతు, సత్యనారాయణ, అబీర్‌బాష, సీఐలు మంజునాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

బనగానపల్లె , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణ శివారులోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవ సాయ రైతులకు, విద్యార్థులకు సీతారామపురం గ్రామంలో చామంతి పంటపై శనివారం అవగాహన కల్పించారు. ఉద్యానవన శాస్త్రవేత్త ఆదినారాయణ, శాస్త్రవేత్త రవిగౌడ్, మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


పుల్లమ్మ (ఫైల్)

దొర్నిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు సూరటి పుల్లమ్మ (100) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె 1924 నవంబరు 6న అవుకు మండలం సంగపట్నంలో జన్మించినట్లు కుటుంబీకులు తెలిపారు. పుల్లమ్మకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. శతాధిక వృద్ధురాలిని చూసేందుకు కాలనీ వాసులు, బంధువులు అధిక సంఖ్యలో వచ్చారు.

రాతిదూలం పోటీల్లో విజేతగా కర్నూలు

చాగలమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె సమీపంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీల్లో కర్నూలు జిల్లా రాయవరం రామచంద్రా రెడ్డికి చెందిన వృషభాలు మొదటి స్థానంలో నిలిచా యి. దాత షబ్బీర్ అహ్మద్ రూ.40 వేలు నగదును రా మచంద్రారెడ్డికి అంద జేశా రు. అలాగే ఆయాస్థానాల్లో నిలిచిన ఎద్దులకు దాత లు పరమేశ్వర్‌రెడ్డి, మహ మ్మ ద్‌రఫీ, రామకృష్ణ, మహ బూబ్‌బాష నగదు అందజే శారు. నిర్వాహకులు నరసిం హా రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామ నరసింహారెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు అల్ట్రాటెక్ చేయూత

కొలిమిగుండ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ తనవంతు చేయూతను అందిస్తుందని యూనిట్ హెడ్ జేపీ సకేంద్రకుమార్ అన్నారు. శనివారం మండలంలోని అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల క్రీడా విద్యార్థుల కోసం రూ.లక్ష విలువ చేసే క్రీడా సామగ్రిని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వారు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మజ, అల్ట్రాటెక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.5.95 లక్షలు

బేతంచెర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.5.95 లక్షలు సమకూరినట్లు ఆలయ నిర్వహణాధి కారి రామాంజనేయులు శనివారం తెలిపారు. వివిధ సేవల ద్వారా ఈ ఆదాయం దేవస్థానానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- జుర్రేరు వంతెన మరమ్మతు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జుర్రేరు వంతెన మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద వంతెన మరమ్మతు పనులను మంత్రి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు తెలిపారు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని పనులు వేగవంతం చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే డీఈ సుధాకర్, ఉపసర్పంచ్ బురానుద్దీన్, పూలకలాం, శరత్‌కుమార్‌రెడ్డి, రాయలసీమ సలాం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంగంపల్లెకు మంత్రి బీసీ రాక

సంజామల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం జరగనున్న 50వ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు నంద్యాల గురురాజా గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి తెలిపారు. శిబిరంలో పేదలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రోగులకు వారి సహాయకులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించినట్లు ఆయన తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గత ప్రభుత్వంలో ఇబ్బందులు

● సర్వసభ్య సమావేశంలో టీడీపీ సర్పంచుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి

డోన్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో సర్పంచులు ఇబ్బందులు పడ్డారని గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం ఆవరణంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గుమ్మకొండ సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులు కొందరు సర్పంచులపై చిన్నచూపు చూశారని ఆరోపించారు. అనంతరం గ్రామ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వివిద శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల గురించి వివరించారు. పలు సమస్యలను వివిధ గ్రామాల సర్పంచులు సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ, విద్యాధికారి ప్రభాకర్, ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, ఏఈ నారాయణ, ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ వార్డెన్ మధు, జూనియర్ కళాశాల బాలుర హాస్టల్ వార్డెన్ అమర్నాథ్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కోవెలకుంట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలో ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ పరిశీలించారు. ఆదివారం కూడా బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా విధులకు గైర్హాజరైనట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

శనగపంట దున్నేసిన వ్యక్తిపై కేసు నమోదు

సంజామల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరుసోమల గ్రామంలో సౌలూరు రాధాదేవికి చెందిన శనగ పంటను దున్నేశాడని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. రాధాదేవి భర్త చంద్రశేఖర్ రెడ్డి, సౌరెడ్డి అన్నదమ్ములు. చంద్రశేఖర్ రెడ్డికి సంబంధిం చిన 1.40 ఎకరాల్లో సాగు చేసిన శనగ పంటను తన అన్న సౌరెడ్డి దున్నివేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు

సంజామల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ముక్కమల్ల గ్రామానికి చెందిన థామస్ అతడి భార్య రమణమ్మపై అదే గ్రామానికి చెందిన మిద్దె ఖాసీం అసభ్యకరంగా మాట్లాడి దాడి చేశాడని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. థామస్ ఇంటి ముందర చుట్టుప్రక్కల వారు చెత్తాచెదారం వేస్తుంటారు. దాంతో ఖాసీం థామస్ భార్యను అసభ్యకరంగా మాట్లాడటంతో అడ్డు వచ్చిన థామస్‌పై దాడి చేశా డు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామ న్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాయలూరు గ్రామానికి చెందిన తలారి బాలప్ప అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ ఎస్ఐ సందీప్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామంలో దాడి చేయగా తలారి బాలప్ప అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి అతని వద్ద 14 మద్యంబాటిళ్లు సీజ్ చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ కామ ప్రవీణ్‌కుమార్‌నాయక్, పోలీసులు హనుమంతు, సుబ్బయ్య, రమేశ్ పాల్గొన్నారు.

మొక్కజొన్నల వ్యాపారిపై కేసు నమోదు

రుద్రవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో మొక్కజొన్నలు కొనుగోలు చేసిన వ్యాపారి గోపాల్‌పై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వర ప్రసాద్ శనివారం తెలిపారు. రూ. 52 లక్షల మేర రైతులకు బకాయి ఉన్నట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి నయనాలప్ప తిరుణాల

- రేపు ఓంకారేశ్వరుడి కల్యాణం


వేడుకలకు ముస్తాబు అయిన ఆలయం

సంజామల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లె కొండలో వెలిసిన నయనాలప్ప తిరుణాల ఆదివారం నుంచి ప్రారంభం కానున్నది. ప్రతి ఏటా కార్తీకమాస చివరి సోమవారం క్షేత్రంలో తిరుణాలను నిర్వహించడం ఆనవాయితీగా వ స్తోంది. క్షేత్రంలో వెలిసిన ఓంకారేశ్వరుడి స్వామి కల్యాణం సోమవారం అ త్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు అన్ని వసతులు కల్పించిన ట్లు ఆలయ కమిటీ సభ్యుడు గుర్కా రామసుబ్బారెడ్డి తెలిపారు. ప్రశాంతంగా తిరుణాలు జరిగేందుకు కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ రమణయ్య ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నైనాలప్ప తిరుణాల సందర్భంగా క్షేత్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎద్దుల రాతిదూలం బండలాగుడు పోటీలను రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. నైనాలప్ప క్షేత్రానికి బస్సులు చేరుకునేందుకు రవాణా సౌకర్యార్థం కోవెలకుంట్ల డిపో నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

నయనాలప్పకు ప్రత్యేక బస్సులు

కోవెలకుంట్ల : కార్తీకమాసం నాలుగో సోమవారం సందర్భంగా కోవెలకుంట్ల నుంచి నయనాలప్పకోనకు, అక్కడి నుంచి జమ్మలమడుగుకు ఉదయం 6గంటల నుంచి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజరు తిరుపతయ్య ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలభైరవుడికి విశేష పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో వెలసిన కాలభైర స్వామికి భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. కార్తీకమాసం బహుళ అష్టమి సందర్భంగా కాలభైరవ స్వామికి, కాళిమాతకు, శివాలయంలో వేకువజాము నుంచే అభిషేకం, అకు పూజ, కుంకుమార్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు దేవాలయం చుట్టూ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరామ దండు(పుల్లయ్య) భజన సంఘం ఆధ్వర్యంలో భజనలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సర్వలక్ష్మీ నరసింహ స్వామికి..

నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో కొలువైన సర్వలక్ష్మీ నరసింహ స్వామికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. అర్చకులు రంగనాయకులు స్వామి, పవన్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలకేంద్రమైన లక్ష్మీనృసింహ కొండపై వెలిసిన కాలభైరవ స్వామికి కాలాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం కార్తీక మాసం కాలాష్టమి పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కాలభైరవ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించినట్లు అర్చకులు మహేష్ శర్మ తెలిపారు. అలాగే మండలంలోని కోరుమానుపల్లె సమీపంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుండం అభయాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి శనివారం కావడంతో భక్తులు తరలివచ్చారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో జ్వాలా తోరణం


జ్వాలతోరణాన్ని తిలకిస్తున్న భక్తులు

అవుకు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా అవుకు పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు జ్వాలతోరణం కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. స్వాముల వారిని అర్చకులు పట్టువస్త్రాలు, పూల మాలలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయం ఆవరణలో పలు రకాల ఆకృతుల్లో దీపాలను వెలగించారు. అనంతరం ఆలయ ముఖద్వారం వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు.

పలుకూరు వాసికి సత్యసేవా పురస్కారం

బనగానపల్లె , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారికి భగవాన్ సత్యసాయి సేవా పురస్కారం అందుకోవడంతో శనివారం పలుకూరులో గ్రామస్థులు శనివారం ఘనంగా సత్కరించారు. భగవాన్ సత్యసాయి బాబా బాబా 99వ జయంతిని పురస్కరించుకొని నెల్లూరుకు చెందిన శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్, పినాకిని యూత్ హెల్పర్ అసోసియేషన్ సంయుక్తంగా బ్రహ్మానందాచారి అందిస్తున్న సామాజిక సేవలను గుర్తించి భగవాన్ సత్యసాయి సేవా పురస్కారం అందించారు. కార్యక్రమంలో కేఈ వెంకటసుబ్బయ్య గౌడ్, బలహనుమంతు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

కొలిమిగుండ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్నప్పుడు మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వైవీఎస్ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో కార్తీక మాసం బహుళ అష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులచే ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించగా, మహిళలు పాల్గొన్నారు.

వాహనదారులు సహకరించాలి: సీఐ

బనగానపల్లె , నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతిఒక్కరు సహకరించాలని సీఐ ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలో ట్రాఫిక్ అధికంగా ఉందని, ముఖ్యంగా పెట్రోల్‌బంకు కూడలి, అవుకు మెట్ట, పొట్టి శ్రీరాముల కూడలి, జీఎం టాకీస్, కొత్తబస్టాండ్ వద్ద వాహనాలు అతివేగంగా నడపరాదన్నారు. బండ్లపై కూరగాయలు, పండ్లు అమ్మే చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తమ వాహనాలను ఉంచాలన్నారు. రోడ్డులో వాహనదారులు దుకాణాల ముందు వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

'నామినేటెడ్ పోస్టుల్లో గిరిజనులకు పెద్దపీట'

డోన్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో సీఎం చంద్రబాబునాయకుడు పెద్ద పీట వేశారని ఆలిండియా బంజార సేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణనాయక్, ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు గోపాల్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అవుకు మండలానికి చెందిన అరుణా నాయక్ సేవలను గుర్తించి గిరిజన కోఆపరేటివ్ డైరెక్టర్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో బంజార సేవా సంఘం, ఎరుకుల హక్కుల పోరాటం సంఘం నాయకులు చోట రామయ్య, సేవా నాయక్, పెద్దయ్య పాల్గొన్నారు.

ఘనంగా మౌలాలి స్వామి ఉరుసు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

డోన్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో వెలసిన హజరత్ హసన్ వలి మౌలాలి స్వామి దర్గాలో శనివారం ఉరుసు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దర్గాలో కిస్తీ ఖలిపా, అక్బర్ బాషా సాహేబ్, సూఫీ పండిత్ ఖాజా బాషా సాహేబ్ మోబాలిగ్ దర్గాలు ప్రత్యేక పూజలు చేశారు. దర్గా కమిటీ అధ్యక్షులు ఎస్ఏ చిన్న రెహిమాన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి'

డోన్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిస రాల్లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములపై విచారణ చేసి తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గుత్తిరోడ్డు సమీపంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని వి మర్శించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై విచారించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరిం చారు.

రబీ పంటలకు బీమా చేయించుకోవాలి

డోన్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రబీ పంటలు పప్పుశనగ, జొన్న, మినుములు, వేరుశనగ, వరి పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలులోకి తెచ్చిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవ కేంద్రాల్లో, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

పంట బీమా పోస్టర్ ఆవిష్కరణ

దొర్నిపాడు: మండలంలోని రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ రకాల పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడులో పంటల బీమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఏఏ రంగారెడ్డి, రైతులు ఉన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య


అంబేడ్కర్ విగ్రహం దగ్గర నివాళి అర్పిస్తున్న మాదిగలు

ప్యాపిలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే హక్కులు సాధించుకోవచ్చని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగా అన్నారు. పట్టణంలోని షాదీఖానాలో మాదిగల కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాట్లాడుతూ మాదిగలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం దగ్గర మాదిగలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగన్న, మద్దిలేటి, శ్రీనివాసులు, రంగన్న, రమేష్, ఎంవీ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చాగలమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ ఎయిడెడ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. శనివారం కళాశాలలో విద్యార్థులు వసంత్, ధనుష్, వైష్ణవిని అభినందించారు. ఈనెల 30న జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. కరస్పాండెంట్ రమణగుప్త, అధ్యాపకులు భగవాన్, స్వప్న, షబ్బీర్‌అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి హోమం

చాగలమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామసమీపంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో కలశ స్థాపన, గణపతిహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. దంపతులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో దాతలు, కమిటీ సభ్యులు పులి రాజగోపాల్‌రెడ్డి, రామనరసింహారెడ్డి, మద్దిలేటి, నరసింహారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

రుద్రవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శినవారం మండలంలోని ఎర్రగుడి సచివాలయం తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. ఎస్‌పీసీఐ మ్యాపింగ్ ఇంటింటికీ జియోట్యాగ్ సర్వే వందశాతం పూర్తిచేయాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

26న ఆళ్లగడ్డలో మెగా జాబ్ మేళా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు తమ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు జిరాక్సులతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రావాలని సూచించారు.

ఎమ్మెల్యే అఖిలప్రియ ఎంపికపై హర్షం


కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అంచనాల కమిటీ సభ్యురాలిగా ఎంపిక కావడంపై టీడీపీ నాయకులు హర్షం ప్రకటించారు. శనివారం చాగలమర్రి నాల్గవ ఎంపీటీ పరిధిలో రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ ఇన్‌చార్జి జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, అనిఫ్, రాజేంద్ర, జెట్టి సురేష్, అబ్దుల్‌ఖాదర్, గాంధీ, బారిక్‌చామల్, నాగూర్‌వలి, ఫరూక్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.